# బలగం TV BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 13 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4




వివరాలు 3వ పేజీలో

## ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా 18 ఏండ్ల గుకేశ్

డింగ్ లిరెన్‌పై గుకేశ్ చారిత్రక విజయం

ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ 2025

# జమిలీకి జై

- న్యాయశాఖ రూపొందించిన బిల్లుకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం
- ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు
- రాజ్యాంగ విరుద్ధమంటున్న ప్రతిపక్షాలు
- 13, 14 తేదీల్లో తప్పనిసరిగా సభకు హాజరు కావాలని తమ ఎంపీలకు బీజేపీ, కాంగ్రెస్ విప్‌లు





**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

: దేశం మొత్తం ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన.. 'జమిలి బిల్లు'కు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. దీంతో.. సమగ్ర బిల్లు పార్లమెంట్ ముందుకు చర్చకు రానుంది. దేశంలో వేరువేరుగా ఎన్నికల నిర్వహణ.. దేశ ప్రగతికి ఆటంకంగా పరిణమిస్తోందంటూ కేంద్రంలోని బీజేపీ మొదటి నుంచి వాదిస్తోంది. ఈ మేరకు గురువారం మోడీ నేతృత్వంలో జరిగిన కేబినెట్ భేటీలో ఆమోద ముద్ర పడింది. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే జమిలి ఎన్నికల బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాల సమాచారం. దీంతో కీలక బిల్లులు సభ ముందుకు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో 13, 14 తేదీల్లో తప్పనిసరిగా సభకు హాజరు కావాలని తమ ఎంపీలకు బీజేపీ, కాంగ్రెస్ విప్ జారీ చేశాయి.

కాగా, రాబోయే సాధారణ ఎన్నికలు.. జమిలిగానే జరపాలని ప్రధాని నరేంద్ర మోదీ కృత నిశ్చయంతో ఉన్నారు. అందుకోసం వ్యూహాత్మంగా అడుగులు వేస్తున్నారు. కానీ, పార్లమెంటులో రాజ్యాంగ సవరణలకు కూటమికి అవసరమైన సంఖ్యా బలం లేదు. అయినా ఈ బిల్లు ఆమోదించుకునేందుకు ముందుకెళ్లాలని మోడీ భావిస్తున్నారు.

గతంలోనే కోవింద్ కమిటి సిఫార్సులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కోవింద్ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ 18,626 పేజీల ఈ నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించింది. 2023, సెప్టెంబర్ 2 ఈ నివేదిక రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. పలువురు నిపుణుల సారధ్యంలో 191 రోజుల కసరత్తు అనంతరం ఈ నివేదికను పూర్తిచేశారు. తొలి దశలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలని, తరువాతి 100 రోజుల్లో రెండో దశలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోవింద్ కమిటీ ఈ నివేదికలో సిఫారసు చేసింది. కోవింద్ కమిటీ తన నివేదికలో ఏకకాలంలో ఓటు వేయడం దేశప్రజల ఆకాంక్షలను సాకారం చేయడంలో సహాయపడుతుందని పేర్కొంది. ఒకేసారి ఐక్యంగా ఓటు వేయడం అనేది అభివృద్ధి ప్రక్రియను, సామాజిక ఐక్యతను ప్రోత్సహిస్తుందని.. ప్రజాస్వామ్య పునాదిని మరింత బలోపేతం చేస్తుందని తెలిపింది. ఏకకాలంలో ఓటింగ్ జరగడం వల్ల పారదర్శకత, సౌలభ్యం, ఓటరు విశ్వాసం గణనీయంగా పెరుగుతుందని కోవింద్ కమిటీ భావించింది.

ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడానికి అవసరమైన పరికరాలు, సిబ్బంది, భద్రతా దళాల ముందస్తు ప్రణాళికను ఈ కమిటీ సిఫారసు చేసింది. తొలిసారిగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీల పదవీకాలం వచ్చే లోక్‌సభ ఎన్నికల వరకు ఉండవచ్చని నివేదిక పేర్కొంది. హంగ్ హౌస్ లేదా అవిశ్వాస తీర్మానం జరిగితే, మిగిలిన ఐదేళ్ల కాలానికి తాజా ఎన్నికలు నిర్వహించవచ్చని కోవింద్ కమిటీ పేర్కొంది. దాదాపు 30 పార్టీలు జమిలి ప్రతిపాదనను సమర్థించగా.. కాంగ్రెస్ సహా 13 పార్టీలు వ్యతిరేకించాయి.

# రైతుకు బేడీలు

- లగచర్ల దాడి కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న రైతు
- సంగారెడ్డి జైల్లో వైద్య పరీక్షల సమయంలో రైతుకు ఛాతినొప్పి
- వైద్యం కోసం జైలు నుంచి ఆసుపత్రికి తరలించిన జైలు అధికారులు
- ఆసుపత్రికి తరలించే సమయంలోనూ బేడీలు వేయడంపై విమర్శలు



**బలగం టీవి, సంగారెడ్డి**

లగచర్ల దాడి కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న రైతు హీర్యానాయక్‌కు సంగారెడ్డి జైలులో వైద్య పరీక్షల సమయంలో ఛాతీ నొప్పి వచ్చింది. దీంతో అతన్ని జైలు నుంచి ఆస్పత్రికి తరలిస్తోన్న సమయంలో పోలీసులు బేడీలు వేసి తీసుకెళ్లడం విమర్శలకు తావిచ్చింది. ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి కూడా స్పందించారు. ఘటనపై అధికారులను ఆరా తీసిన ఆయన.. రైతుకు బేడీలు వేసి తీసుకెళ్లాల్సినంత అవసరం ఏమొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరించారు. రైతుకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. కాగా, ఛాతీ నొప్పి రావడంతో రైతు హీర్యానాయక్‌కు తొలుత సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందించారు. అతని ఆరోగ్యం నిలకడగా ఉందని.. మెరుగైన చికిత్స కోసం పంజాగుట్ట నిమ్స్‌కు తరలించారు. నిమ్స్ ఎమర్జెన్సీ విభాగంలో రైతుకు చికిత్స అందిస్తున్నారు.

### జైలర్ సస్పెన్షన్

రైతుకు బేడీలు వేసిన ఘటనలో సంగారెడ్డి జైలర్ సంజీవరెడ్డిని సస్పెండ్ చేస్తూ జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రా ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనపై ఐజి సత్యనారాయణ విచారణలో పలు సంచలన విషయాలు బయటపడ్డాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో హుటాహుటిన సంగారెడ్డి వెళ్లి విచారణ జరిపిన ఐజి సత్యనారాయణ అక్కడ మీడియాతో మాట్లాడారు. విచారణ ఖైది హీర్యా నాయక్‌ను లగచర్ల రైతుగా పేర్కొనకుండా బాలానగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఒక కేసులో నిందితుడిగా చూపడం వల్లనే అతనికి బేడీలు వేసినట్లు బయటపడిందని ఐజి తెలిపారు. ఈ ఘటనలో జైలు అధికారుల తప్పిదం అడుగడుగునా కనిపించిందని ఆయన పేర్కొన్నారు. గుండెనొప్పి అని చెబితే బెయిల్ వస్తుందని హీర్యా నాయక్‌కు లగచర్ల ఘటనలో ఎ2 నిందితుడు సురేష్ తప్పుదోవ పట్టించినట్టు తేలిందని ఐజి తెలిపారు. సదరు సురేష్ ఇంకా ఎవరెవరితో మాట్లాడిన విషయంపై ఆరా తీస్తున్నామని తెలిపారు. జైలు అధికారులు ఉద్దేశపూర్వకంగా పొరపాటు చేశారా? లేక పొరపాటుగా ఇది జరిగిందా? అనే కోణంలో విచారణ జరపగా పై విషయాలు బయటపడ్డాయన్నారు. విచారణ ఖైదీలను ఆసుపత్రికి తీసుకెళ్లే సమాచారాన్ని అటు వికారాబాద్ పోలీసులకు గానీ, సంగారెడ్డి పోలీసులకు గానీ సమాచారం ఇవ్వకుండా సైబరాబాద్ పోలీసులకు తెలియజేయడం వెనుక కుట్ర ఏమైనా ఉందా? అనే కోణంలో విచారణ జరిపినప్పుడు పై విషయాలు బయటపడ్డాయని ఐజి సత్యనారాయణ వెల్లడించారు.

## గంజాయి డాన్ అరెస్టు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గత కొంత కాలం నుంచి తప్పించుకుని తిరుగుతున్న గంజాయి డాన్ అంగూర్‌బాయ్‌ని ఎక్సైజ్ సిబ్బంది గురువారం అరెస్టు చేశారు. ఎక్సైజ్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ధూల్‌పేటకు చెందిన అంగూర్ బాయి కొన్ని ఏళ్ల నుంచి గంజాయి విక్రయిస్తోంది. నగరంలో గంజాయి ప్రధాన డీలర్‌గా వ్యవహరిస్తున్నారు. అంగూర్ బాయి వద్దనే నగరంలోని చాలామంది గంజాయి విక్రేతలు కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. ఇలా చాలా ఏళ్ల నుంచి గంజాయి విక్రయిస్తున్న అంగూర్ బాయి కోట్లాది రూపాయలు సంపాదించారు. నిందితురాలిపై నగరంలోని పలు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. పదమూడుసార్లు ఎక్సైజ్ సిబ్బంది అరెస్టు చేసి జైలుకు పంపించినా బయటికి వచ్చిన తర్వాత గంజాయి దందా చేస్తోంది. ధూల్‌పేట్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 3, మంగళ్‌హాట్ పిఎస్‌లో 4, ఆసిఫ్‌నగర్, గౌరారం స్టేషన్లలో నమోదైన పది కేసుల్లో ముద్దాయిగా ఉంది. ఇటీవల కాలంలో అంగూర్‌బాయిపై దృష్టి పెట్టిన ఎక్సైజ్ సిబ్బంది విస్తృతంగా గాలిస్తున్నారు. ఈ క్రమంలోనే కార్వాన్ పోలీసులు అరెస్టు చేశారు. అంగూర్ బాయ్ కుటుంబ సభ్యులు పదిమందిపై ఐదు నుంచి పది కేసులు ఉన్నాయి. అంగూర్ బాయ్‌ని అరెస్టు చేసిన ఎస్‌టిఎఫ్ , ఎక్సైజ్ పోలీసులను ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్‌రెడ్డి అభినందించారు.

# ఆర్‌ఆర్‌ఆర్‌కు అనుమతులివ్వండి



- హైదరాబాద్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ మంజూరు చేయండి
- జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగానికి (159 కిలో మీటర్ల) అవసరమైన సాంకేతిక, ఆర్థికపరమైన అనుమతులను వెంటనే ఇవ్వాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో సీఎం రేవంత్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు.

2017లోనే ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగాన్ని 161 ఏఏ జాతీయ రహదారిగా ప్రకటించారని సీఎం గుర్తు చేశారు. ఇప్పటికే ఈ రహదారి నిర్మాణానికి అవసరమయ్యే భూమిలో 94 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం సేకరించిందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దక్షిణ కాశీగా గుర్తింపు పొందిన శ్రీశైలంను హైదరాబాద్‌తో అనుసంధానించే ఎన్‌హెచ్-765లో 125 కిలోమీటర్ల దూరం జాతీయ రహదారుల ప్రమాణాలతో ఉందని, మిగిలిన 62 కిలోమీటర్లు ఆమ్రాబాద్ అటవీ ప్రాంతంలో ఉందని తెలిపారు. అటవీ, పర్యావరణ శాఖ నిబంధనల ఫలితంగా ఆ మేరకు రహదారి అభివృద్ధికి ఆటంకంగా ఉందని, కేవలం పగటి వేళలో మాత్రమే రాకపోకలు సాగించాల్సి వస్తోందని సీఎం కేంద్ర మంత్రికి తెలిపారు. ఆమ్రాబాద్ అటవీ ప్రాంతంలో నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని, ఇందుకు 2024-25 బడ్జెట్లో నిధులు మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తే హైదరాబాద్ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా మధ్య 45 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్య నగరాలైన హైదరాబాద్-విజయవాడ (ఎన్.హెచ్-65) రహదారిని ఆరు వరుసలుగా విస్తరించే పనుల డీపీఆర్‌ను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ రహదారి విస్తరణ పనులు పూర్తయితే ప్రమాదాలకు అడ్డుకట్ట వేసి ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన వారమవుతామని చెప్పారు. తెలంగాణలోని రెండో పెద్ద నగరమైన వరంగల్ దక్షిణ భాగం బైపాస్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని సీఎం కోరారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్‌ను అనుసంధానించే ఎన్‌హెచ్-63 (16) వరంగల్, హన్మకొండ నగరాల మధ్యగా వెళుతోందని ఈ రహదారిని నగరం వెలుపల నుంచి నాలుగు చోట్ల కలుపుతూ బైపాస్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పర్వత్ మాల ప్రాజెక్ట్‌లో యాదాద్రి దేవాలయం, నల్లగొండ పట్టణంలోని హనుమాన్ కొండ, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ వద్ద రోప్ వేలను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. గోదావరి, కృష్ణా నదులపై గిరిజనులు అత్యధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో ప్రజా రవాణాకు ఇబ్బందిగా ఉన్న పది చోట్లా పాంటూన్ బ్రిడ్జిలు మంజూరు చేయాలని, నల్లగొండ జిల్లాల్లో ఎన్.హెచ్-65

మిగితా 2వ పేజీలో

## రాష్ట్ర గవర్నర్ తగిన విచారణకు ఆదేశించాలి : కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్**

లగచర్ల గిరిజన రైతులకు బేడీలు వేయడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ గుండె నొప్పి వచ్చిన రైతన్నకు సంకెళ్లు వేయడం దారుణమని , రేవంత్ రెడ్డి క్రూరమనస్తత్వానికి నిదర్శనమని ఆరోపించారు. లగచర్ల గిరిజన రైతుకు బేడీలు వేసిన ఘటనను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుమోటోగా తీసుకొని విచారణకు ఆదేశించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర గవర్నర్ ఈ అంశం లోని తగిన విచారణకు ఆదేశించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి జైపూర్‌లో విందులు, వినోదాలతో జల్సాలు చేసుకుంటూ చిందులు వేస్తున్నారని... ఇక్కడ రైతులకు బేడీలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హీర్యా నాయక్ కి గుండెల్లో నొప్పి వస్తే వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం అలసత్వం చూపిందని మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని కుటుంబ సభ్యులకు, బయటకు చెప్పకుండా దాచిపెట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. సకాలంలో ఆసుపత్రికి తరలించకుండా అమానవీయంగా వ్యవహరించిందని విమర్శించారు గురువారం ఉదయం రెండోసారి మళ్లీ గుండెపోటు రావడంతో అతడిని సంగారెడ్డి ఆసుపత్రికి తీసుకువెళ్లారని పేర్కొన్నారు. గిరిజన రైతులు జైళ్లలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీకి నిజంగానే హృదయం ఉంటే, గిరిజనుల పట్ల ప్రేమ ఉంటే రైతులపై పెట్టిన కేసులను రద్దు చేయాలని ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు బేడీలు వేయడమంటే రేవంత్ రెడ్డి క్రూరమనస్తత్వానికి నిదర్శనమన్నారు. రైతుకు ఛాతినొప్పి వస్తే వైద్య సాయం అందించడంలో అలసత్వం చూపారని మండిపడ్డారు. ఈర్యా నాయక్‌తో పాటు రాఘవేంద్ర, బసప్ప ఆరోగ్యం కూడా బాగా లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే తమ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయన్నారు. గుండెపోటు వచ్చిన రైతును ప్రభుత్వం స్ట్రెచర్ మీదనో, అంబులెన్స్ మీదనో తీసుకు రావాల్సి ఉండగా బేడీలు వేసి తీసుకురావడం శోచనీయమన్నారు.

## ప్రార్థనా స్థలాలపై సర్వేలు ఆపండి

- సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

దేశవ్యాప్తంగా అనేక చోట్ల ప్రార్థనా స్థలాలపై నిర్వహిస్తున్న సర్వేలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న సర్వేలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఏ కోర్టులోనూ ప్రర్థనా స్థలాల చట్టానికి సంబంధించిన పిటిషన్లు తేవొద్దని స్పష్టం చేసింది. 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టానికి సంబంధించి బిజెపి నేత సుబ్రహ్మణ్య స్వామి దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీం కోర్టు నేడు విచారణ చేపట్టింది. ఆయనతోపాటు వివిధ పార్టీల నాయకులు జితేంద్ర అహ్వాద్, శరద్ పవార్, మనోజ్ కుమార్ ఝా తదితరులు కూడా వేర్వేరు పిటిషన్లు వేశారు. వీటన్నిటిపై నాలుగు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. అంతేకాక పెండింగ్ లో ఉన్న కేసుల్లో ఎలాంటి తీర్పులు, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వరాదంటూ జిల్లా కోర్టులు, హైకోర్టులను ఆదేశించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తులు సంజయ్ కుమార్, కెవి. విశ్వనాథన్ లతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం తన స్పందనను తెలిపేంత వరకు ఈ అంశంపై నిర్ణయం తీసుకోలేమని ధర్మాసనం తెలిపింది.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్



### 12 మంది మావోయిస్టులు మృతి

**బలగం టీవి, హైదరాబాద్**

ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపుర్ జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. 12 మంది మావోయిస్టులు మృతిచెందారు. అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో బస్తర్ రేంజ్‌లో ఉన్న నాలుగు జిల్లాల(నారాయణపూర్, దంతెవాడ, జగదల్‌పుర్, కొండగావ్) బలగాలు భారీ కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు, భద్రతా దళాలకు ఎదురు పడ్డారు. అనంతరం పోలీసులపైకి కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా దళాలు ఎదురుకాల్పులు జరిపాయి. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య కాల్పులు ప్రారంభమయ్యాయి. కూంబింగ్‌లో డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి. సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా ఇప్పటివరకు యూనిఫాంలు ధరించిన ఏడుగురు గుర్తుతెలియని నక్సలైట్ల మృతదేహాలు స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ ఐజీ పీ సుందర్‌రాజ్ తెలిపారు. సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని చెప్పారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో మావోయిస్టుల కోసం ముమ్మర గాలింపు చేపట్టారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా డిసెంబర్ 15న బస్తర్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో మావోయిస్టు దళం యాక్టివ్ అయ్యిందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమై పోలీసులు, బస్తర్ రేంజ్‌లోని నాలుగు జిల్లాల నుంచి దాదాపు వేయి మంది భద్రతా బలగాలను రంగంలోకి దింపారు. మావోయిస్టుల ఆచూకీ కోసం భారీ ఆపరేషన్ చేపట్టారు.

# అదానీ వ్యవహారంపై ప్రతిపక్షాల ఆందోళన





- పార్లమెంట్ ఆవరణలో నిరసన
- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుపై ప్రివిలేజ్ నోటీస్

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

అదానీ ముడుపుల వ్యవహారంపై చర్చకు పట్టుబడుతూ ఇండియా బ్లాక్ పార్టీలు గురువారం కూడా వినూత్నంగా ఆందోళన చేపట్టాయి. 'దేశ్ బిక్నే నహి దేంగే' అని హిందీలో ఒక్కో అక్షరంతో రాసి ఉన్న ఒక్కో ప్లకార్డు చేతబూని నిరసన వ్యక్తం చేశారు. సభకు వెళ్లే ప్రధాన గేటు మకర ద్వారం, సంసద్ భవన్ (ఓల్డ్ పార్లమెంట్ భవనం) ముందు ప్రతిపక్ష ఎంపీలంతా మానవహారం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ, అదానీకి వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, శివసేన, డీఎంకే, ఎన్‌సీపీ, ఆప్, కేరళ కాంగ్రెస్, జేఎంఎం, ఐయూఎంఎల్ తదితర పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదానీ ముడుపుల వ్యవహారంపై జాయింట్ పార్లమెంట్ కమిటీ (జేపీసీ)తో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

పార్లమెంట్ ఉభయ సభలు గురువారం వాయిదాల పర్వం తొక్కాయి. సభలు ప్రారంభమైన క్షణం నుంచి అధికార, ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలతో గందరగోళం నెలకొంది. దీంతో లోక్‌సభను మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాయిదా వేశారు. ఆ తరువాత మరోసారి మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. అమెరికా వ్యాపారవేత్త జార్జ్ సోరస్‌తో కాంగ్రెస్ పార్టీకి లింకు ఉన్నట్టు బీజేపీ ఆరోపించగా, అదానీ అంశంపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఇరు వైపుల సభ్యుల నినాదాలతో సభ హోరెత్తింది. ప్రశ్నోత్తరాల సమయం పూర్తి అయిన తరువాత,

మిగితా 2వ పేజీలో



## పాలనపై దృష్టి పెట్టాం..
## అందుకే ప్రచారంలో వెనుకబడ్డాం

- మంత్రివర్గ విస్తరణపై హైకమాండ్ నిర్ణయం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

తమ ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టిందని.. అందుకే ప్రచారంలో వెనుకబడ్డమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. మంత్రివర్గ విస్తరణపై హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. గురువారం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలకు మల్లు ఢిల్లీలో అల్పాహారం ఇచ్చారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ఢిల్లీలో ఈరోజు రాహుల్ గాంధీని కలవలేదని అన్నారు. తెలంగాణలో ప్రజాపాలన పట్ల 50 శాతానికి పైగా ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. వందశాతం మంది ప్రభుత్వ పాలన పట్ల సంతోషంగా ఉంటారనుకోవడం లేదని చెప్పారు. ప్రజాస్వామ్యం అంటే ఎంతో కొంత వ్యతిరేకత ఉంటుందని చెప్పారు. హైడ్రాకు ధనిక, పేద అన్న తేడా లేదని స్పష్టం చేశారు. ఎవరు చెరువులను ఆక్రమించిన వారిపై హైడ్రా చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 25 ఎకరాల స్థలంలో

మిగితా 2వ పేజీలో

## జనవరి 19 నుంచి కొమురవెల్లి మల్లన్న జాతర

**బలగం టీవి, హైదరాబాద్**

సిద్దిపేట జిల్లా చేర్యాలలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరలను తెలంగాణ ఆధ్యాత్మిక సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వైభవోపేతంగా నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వేలాదిగా జాతరకు తరలివచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఏ చిన్న పొరపాటు తలెత్తకుండా పటిష్టమైన కార్యాచరణతో ఏర్పాట్లు చేయాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. గురువారం సచివాలయం దేవాదాయ ధర్మాదాయ మంత్రిత్వశాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంత్రి సురేఖ సిద్దిపేట జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

మిగితా 2వ పేజీలో

# ఆర్‌ఆర్‌ఆర్‌కు అనుమతులివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

పక్కన 67 ఎకరాల ప్రభుత్వ భూమిలో ట్రాన్స్‌పోర్ట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, సురేశ్ షెట్కార్, మల్లు రవి, కడియం కావ్య, ఎం. అనిల్ కుమార్ యాదవ్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

తెలంగాణలో వివిధ రకాల అభివృద్ధి పనులకు కేంద్రం మద్దతు ఇచ్చేందుకు కృషి చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్), హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2తో పాటు హైదరాబాద్, వరంగల్‌ల్లో సీవరేజీ, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ ప్లాన్, సింగరేణి సంస్థకు బొగ్గు గనుల కేటాయింపు సహా పలు అంశాలపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. కిషన్‌రెడ్డిని గురువారం సాయంత్రం ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా రూ.1,63,559.31 కోట్ల విలువైన ప్రాజెక్టుల విషయంలో కేంద్రం నుంచి కావాల్సిన చేయూతపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. ట్రిబుల్ ఆర్‌ను నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోడీ 2022లోనే ప్రకటించిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం భూ సేకరణను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని, త్రైపాక్షిక ఒప్పందం పూర్తయినా ఇప్పటి వరకు ఎన్‌హెచ్‌ఏఐ అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగానికి ఇంకా అనుమతి ఇవ్వని విషయాన్ని కేంద్ర మంత్రికి సీఎం గుర్తు చేశారు. ఆర్‌ఆర్‌ఆర్‌తో పాటు రేడియల్ రోడ్లు పూర్తయితే ఫార్మా పరిశ్రమలతో పాటు ఇండస్ట్రియల్ హబ్‌లు, లాజిస్టిక్ పార్క్స్, రిక్రియేషన్ పార్కులు వంటివి అభివృద్ధి అవుతాయని సీఎం అన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ రెండు వైపులా పూర్తికి ఈ రహదారికి సంబంధించి వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అనుమతులన్నీ ఇప్పించేందుకు కృషి చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.34,367.62 కోట్లు అని కేంద్ర మంత్రికి తెలిపారు. ఓఆర్‌ఆర్–ఆర్‌ఆర్‌ఆర్‌ల అనుసంధానానికి రేడియల్ రోడ్లు నిర్మించాలని సంకల్పించామని సీఎం తెలిపారు. పది గ్రీన్‌ఫీల్డ్ రోడ్లతో పాటు ఓఆర్‌ఆర్ అనుసంధానించే మెట్రో కారిడార్ రేడియల్ రోడ్లకు రూ.45 వేల కోట్లు వ్యయమవుతుందని కేంద్ర మంత్రికి వివరించారు.

మెట్రో ఫేజ్ 2లో భాగంగా నాగోల్ నుంచి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, రాయదుర్గం నుంచి కోకాపేట్ నియోపొలిస్, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట, మియాపూర్–పటాన్‌చెరు, ఎల్‌బీ నగర్–హయత్ నగర్ మధ్య మొత్తం 76.4 కి.మీ నిర్మించనున్న మెట్రో రైలు నిర్మాణానికి రూ.24,269 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేసినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 50:50 వాటాతో మెట్రో ఫేజ్‌ను 2 చేపట్టేందుకు సహకరించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు.

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ పరిధిలోని 222.27 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఇప్పటికే కోరిన విషయాన్ని కేంద్ర మంత్రికి సీఎం గుర్తు చేశారు. ఆ భూముల బదలాయింపుతో పాటు గాంధీ సరోవర్ నిర్మాణం, మూసీ సీవరేజీ ప్రాజెక్టులు, 11 హెరిటేజ్ వంతెనల నిర్మాణంతో పాటు ఇతర పనులకు రూ.14,100 కోట్లు వ్యయమవుతాయని అంచనా వేశామని, నిధుల మంజూరుతో పాటు అనుమతులకు సహకరించాలని కేంద్ర మంత్రిని కోరారు.

మూసీ పునరుజ్జీవంలో భాగంగా గోదావరి నీటిని మూసీకి తరలించేందుకు, గోదావరి నుంచి నగరానికి 15 టీఎంసీలను హైదరాబాద్ తాగునీటి అవసరాలకు తరలించేందుకు రూ.7,440 కోట్లతో ప్రణాళికలు రూపొందించినట్టు కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. ఆ మొత్తం విడుదలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వెంట ఎంపీలు సురేశ్ షెట్కార్, బలరాం నాయక్, రఘురాంరెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎం. అనిల్ కుమార్ యాదవ్, జి. వంశీకష్ణ, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి ఉన్నారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో సీఎం రేవంత్ భేటీ కావడం జరిగింది. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రీయ విద్యాలయాలను కేటాయించాలని కోరడం జరిగింది. తెలంగాణకు ఇటీవల%ఏడు నవోదయ విద్యాలయాలను కేటాయించినందుకు కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# జనవరి 19 నుంచి కొమురవెల్లి మల్లన్న జాతర

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి పొన్నం ప్రభాకర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారులు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) అబ్దుల్ హమీద్, ఆర్డీవో, కొమురవెల్లి ఆలయ ఏఈఓ శ్రీనివాస్, ఆర్టీసి డిపో మేనేజర్, డిఎంహెచ్ఓ, డిపిఓ, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి,గ్రామీణ నీటి సరఫరా, ఫైర్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ తదితర శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ గత సంవత్సరం కంటే మరింత వైభవోపేతంగా మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరను నిర్వహించనున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. డిసెంబర్ 29 ఉదయం 10.45 గంటలకు శ్రీ మల్లికార్జున స్వామి వారి కల్యాణాన్ని, జనవరి 19 నుండి 10 వారాలపాటు మార్చి 24 వరకు జాతరను నిర్వహించేందుకు నిర్ణయించినట్టు చెప్పారు. ఈ దిశగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేయాలని పోలీస్, విద్యుత్, వైద్యారోగ్యం, ఆర్టీసి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులను మంత్రి సురేఖ ఆదేశించారు. భక్తులు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కల్యాణాన్ని వీక్షించి, స్వామి అమ్మవార్లను దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యేలా వీలుగా అన్ని శాఖల సమన్వయంతో వ్యవహరించేలా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ కలెక్టర్ ను నిర్దేశించారు. గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కల్యాణ వేదికను విశాలంగా తీర్చిదిద్దాలని ఈవోను మంత్రి సురేఖ ఆదేశించారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమ్మవార్లు బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలకు కిరీటాల తయారీ పనుల పై మంత్రి సురేఖ ఆరా తీశారు. రూ. 9.776 కోట్లు ఎస్డిఎఫ్ నిధులు, రూ. 36.18 కోట్ల దేవాదాయ శాఖ నిధులతో చేపడుతున్న కార్యక్రమాలను ఈవో మంత్రి సురేఖకు వివరించారు. కిరీటాల తయారీ పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. ప్రతి రోజూ స్వామివారికి అలంకరించే పూలను తదనంతరం పడేయకుండా అగర్‌బత్తీలు తయారుచేసే సాంకేతికతను వాడుకుని దేవాలయ అవసరాలకు వినియోగించుకోవాలని మంత్రి సురేఖ ఈవోను నిర్దేశించారు.

ఎల్లమ్మ దేవాలయంలో మొక్కులు సమర్పించుకునే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు కల్యాణోత్సవానికి, జాతరకకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే పరిస్థితులున్నందున ఈ దిశగా చర్యలు చేపట్టాలని సిద్దపేట డిపో మేనేజర్ కు మంత్రి సురేఖ సూచించారు. భక్తుల క్యూలైన్లు, బారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, సిసి కెమరాల నిఘా, వివిఐపిలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు, భక్తులకు దారులను తెలిపేలా సైన్ బోర్డులు, తాగునీటి సదుపాయం, మెడికల్ క్యాంపు, లాక్టేషన్ గదులు తదితర ఏర్పాట్లు చేయాలని మంత్రి సంబంధిత అధికారులకు సూచించారు. జాతర సమయానికి వేసవి కాలం రానుండటంతో భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, నడిచే మార్గాల్లో మ్యాట్లు, వృద్ధులు, వికలాంగులు, గర్భిణులకు బ్యాటరీ వాహనాలు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు.

# అదానీ వ్యవహారంపై ప్రతిపక్షాల ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

జీరో అవర్‌లో ప్రతిష్టంభన మొదలైంది. కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి మాట్లాడుతూ.. ఓ వ్యాపారవేత్తకు, బీజేపీకి లింకులున్నట్టు ఆరోపించారు. అయితే ఆ వ్యాపారవేత్త పేరును రికార్డుల్లో చేర్చడం లేదని స్పీకర్ చైర్‌లో ఉన్న జగదాంబికా పాల్ తెలిపారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ ఎంపీ కె.సి వేణుగోపాల్ మాట్లాడుతూ ఎటువంటి నిబంధన లేకుండానే జీరో అవర్‌లో కేంద్ర మంత్రి పియూష్ గోయల్ జోక్యం చేసుకుని కాంగ్రెస్ నేతలను విమర్శించారని, వాటిని రికార్డుల్లో ఉంచారని గుర్తు చేశారు. కానీ ప్రతిపక్ష సభ్యురాలు నిబంధన ప్రకారమే మాట్లాడితే, ఆ వ్యాఖ్యలను తొలగిస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. పక్షపాత ధోరణి పనికి రాదని, అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరించడం తగదని విమర్శించారు. దీనిపై ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. కాంగ్రెస్ నేతలకు, జార్జ్ సోరస్‌కు లింకులు ఉన్నట్లు బీజేపీ నేత నిశికాంత్ దూబే ఆరోపించారు. ఇండియాను నిర్వీర్యం చేసేందుకు సోరస్‌తో కలిసి కాంగ్రెస్ పని చేస్తున్నదని అన్నారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు రాజ్యసభలోనూ ఇదే తంతు కొనసాగింది. అధికార, ప్రతిపక్షాల ఆందోళనల నడుమ సభ వాయిదా పడింది. తొలుత ప్రారంభమైన సభలో కేంద్ర మంత్రి, సభా నాయకుడు జేపీ నడ్డా మాట్లాడుతూ ప్రతిపక్షాలపై విమర్శలు చేశారు. సభకు తరచూ అంతరాయం ఏర్పడుతోందని, అందుకు ప్రతిపక్షమే కారణమని అన్నారు. నడ్డా మాట్లాడిన తరువాత ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే మాట్లాడేందుకు ప్రయత్నించారు. కానీ అవకాశం ఇవ్వకుండా మధ్యాహ్నం 2 గంటలకు సభను వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో కూడా గందరగోళం నెలకొనడంతో సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

## కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుపై ప్రివిలేజ్ మోషన్..

కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుపై ప్రతిపక్ష ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభకు తాము అనర్హులమన్న ఆయన వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుకు వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్ నోటీసు ఇచ్చారు. సుమారు 60 మంది ఎంపీలు సభా హక్కుల తీర్మానానికి మద్దతు తెలిపారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బుధవారం రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యులను విమర్శించారు. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధంఖర్‌పై ప్రతిపక్షాల విమర్శలను ఆయన తిప్పికొట్టారు. ఈ సందర్భంగా 'మీరు కుర్చీని గౌరవించలేకపోతే, ఈ సభలో సభ్యులుగా ఉండే హక్కు మీకు లేదు' అని ప్రతిపక్ష సభ్యులను ఉద్దేశించి అన్నారు.

# యువత క్రీడల్లో రాణించాలి

- చదువు, ఉద్యోగంతో పాటు మానసికోల్లాసం కోసం క్రీడలు కూడా ముఖ్యమే..
- ఎస్పీ అఖిల్ మహాజన్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

యువత క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని,క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయని, స్పోర్ట్స్ కోటాతో కూడా ఉద్యోగాలకు ఎంపికయ్యే అవకాశం ఉంటుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. రుద్రంగి మండలం దేగావత్ తండా గ్రామ యువతకు స్పోర్ట్స్ కిట్లును ఎస్పీ అఖిల్ మహాజన్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రజల కోసమే పోలీసులు ఉన్నారని, ప్రజా శ్రేయస్సే పోలీసుల ధ్యేయం అన్నారు.యువత చెడు మార్గాల వైపు మరలకుండా వారితో మమేకమై కమ్యూనిటీ పోలీస్ లో భాగంగా జాబ్ మేళా, దోస్తీ మీట్ మొదలగు కార్యక్రమాలు పోలీస్ శాఖ తరపున నిర్వహించడాం జరుగుతుందన్నారు.

గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని,యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రుల మీద ఉంటుందని,యువకులు గంజాయి, జూదం వంటి చెడు అలవాట్లకు, ఇతర చెడు మార్గాల వైపు మరలకుండా చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టి, ఉద్యోగాలు సంపాదించి, తమ తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని, గ్రామానికి మంచి గుర్తింపు తీసుకురావాలనిఅన్నారు . .క్రీడలతో శారీరక దారుఢ్యం పెరుగుతుందని, క్రీడల పోటీల నిర్వహణకు పోలీస్ శాఖ తరుపున యువతకు ఎల్లవేళలా సహకరించి, ప్రోత్సహిస్తామని అన్నారు. గ్రామాల నుండి ఉపాది నిమిత్తం గల్ఫ్ వెళ్ళేవారు నకిలీ ఏజెంట్లకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దని అప్రమత్తంగా ఉండాలని, ఇమ్మిగ్రేషన్ చట్టబద్ధత ఉన్నవారి నుంచి వీసాలు పొందాలన్నారు.గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు లైసెన్స్ గల ఏజెంట్ల వివరాలు తెలుసుకొనుటకు జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ 8712656411 లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ వారిని సంప్రదించవచ్చని సూచించారు.

# నివాస స్థలాలకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్

**బలగం టీవీ, సిరిసిల్ల :**

సిరిసిల్ల బి వై నగర్ సుందరయ్య నగర్ ఇంద్రనగర్ పద్మనగర్ లో నివాస స్థలాలకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ అన్నారు. గురువారం అమృత్లాల్ శుక్ల కార్మిక భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ము శం రమేష్ మాట్లాడుతూ సిరిసిల్ల ప్రాంతంలోని బివై నగర్ సుందరయ్య నగర్ పద్మా నగర్ ఇందిరానగర్ రాజీవ్ నగర్ లో ప్రభుత్వం ఇచ్చిన నివాస స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసుకునే హక్కు కల్పించాలని అన్నారు.45 సంవత్సరాల క్రితం ప్రభుత్వం నిరుపేదలకు నివాస స్థలాల పట్టాలు ఇవ్వడం జరిగిందిఅని, ప్రస్తుతం పట్టణం అభివృద్ధి జరుగుతుందిఅని,ఈ ప్రాంతాలు కూడా అభివృద్ధి జరుగుతున్నాయి కానీ ఈ ప్రాంత నివాసులకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వీలు లేకపోవడంతో బ్యాంకు నుండి లోను కానీ వ్యాపారానికి కోసం లోను కాని స్థలం మీద తీసుకోవడానికి వీలు లేకుండా పోతుందని అన్నారు. ప్రజలందరూ ఎన్నో ఏళ్ల నుండి రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలని పోరాడుతున్నారుఅని అన్నారు. గత ప్రభుత్వానికి అనేక దఫాలుగా విన్నతులు విన్నవించడం జరిగిందిఅని,మున్సిపల్ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మానం కూడా చేయడం జరిగింది, కానీ సమస్య పరిష్కారం జరగలేదు అని అన్నారు. గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ పట్టించుకోవడం లేదుఅని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షను గుర్తించి ఈ సమస్యను పట్టించుకోని రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించి, లోన్ వచ్చే విధంగా జీవో తీసుకురావాలని అన్నారు లేనిపక్షంలో అందర్నీ ఐక్యం చేసి ప్రజా పోరాటం నిర్వహిస్తామని అన్నారు సమావేశంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎగబట్టి ఎల్లారెడ్డి.సిపిఎం పట్టణ కార్యదర్శి అన్నల్దాస్ గణేష్ సిపిఎం నాయకులు నక్క దేవాదాస్ ఉడుత రవి కోలా శ్రీనివాస్ సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు

# పాలనపై దృష్టి పెట్టాం..

(మొదటిపేజీ తరువాయి)

ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేపట్టబోతున్నామని తెలిపారు. రైతు భరోసాను సంక్రాంతి నుంచి అమలుచేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించామని అన్నారు. రైతులకు ఇచ్చే బోనస్‌లో రైతు భరోసా, రుణమాఫీ కన్నా ఎక్కువ లబ్ధి రైతులకు చేకూర్చుతుందని మల్లు భట్టి విక్రమార్క వివరించారు. తెలంగాణ తల్లి గతంలో అధికారికంగా లేదని గుర్తుచేశారు. అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు జరగాలన్న నిబంధన లేదని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీ రూల్స్ మార్చారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చేసిన అప్పులకు 11 నెలల్లో రూ.64 వేల కోట్ల అసలు వడ్డీ కట్టామని తెలిపారు. రాష్టం ఏర్పడే నాటికి ఏడాదికి రూ.6400 కోట్లు ఉంటే ఇప్పుడు ఏడాదికే రూ.64 వేల కోట్లు కట్టాల్సి వచ్చిందనిమల్లు భట్టి విక్రమార్కతెలిపారు. పదేళ్ల తర్వాత హాస్టళ్లకు ఇచ్చే డైట్ చార్జీలు పెంచామని తెలిపారు. డిసెంబర్ 14 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్స్‌లో ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తామని ప్రకటించారు.

# పౌష్టికరమైన రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలి

- డిసెంబర్ 14న కామన్ డైట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని హాస్టళ్లలో ఒకే డైట్ ప్లాన్ అమలవుతుం దని, పిల్లలకు పౌష్టిక, రుచికరమైన ఆహారం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవి , మాడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలల్లో కామన్ డైట్ మెనూ అమలు కార్యక్రమ ప్రారంభోత్సవము పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ డిసెంబర్ 14న ప్రభుత్వ ఆదేశాల మేరకు కామన్ మెనూ కార్యక్రమం ప్రారంభోత్సవము ఉంటుందని, విద్యార్థులకు కామన్ డైట్ ప్లాన్ డిసెంబర్ 14 నుంచి అమలులోకి వస్తుందని అన్నారు. కామన్ డైట్ ప్లాన్ పై విస్తృతంగా ప్రచారం కల్పించాలని, పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించి ప్రారంభోత్సవ కార్యక్రమం చేయాలని సూచించారు.

డిసెంబర్ 14న కామన్ డైట్ ప్రారంభోత్సవం జరుగుతుందని పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని , హాస్టల్స్ లో కామన్ డైట్ వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, ప్రతి హాస్టల్ లో ఒకే రకమైన ఆహారం విద్యార్థులకు అందించడం జరుగుతుందని అన్నారు. కిచెన్ %డ% డైనింగ్ ఎరియా నిర్వహణ మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

డిసెంబర్ 14న ఉదయం 11 గంటలకు విఐపి లు రెసిడెన్షియల్ పాఠశాలలకు చేరుకుంటారని, 11 నుంచి 12 గంటల వరకు పాఠశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారని, 12 నుంచి 12.30 గంటల వరకు పిల్లలతో ఇంటరాక్షన్, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. అనంతరం కామన్ డైట్ ప్లాన్ సంబంధించిన హాండ్ బుక్ ముఖ్య అతిథి చే ఆవిష్కరించి ప్రసంగిస్తారని, అనంతరం 1 గంటలకు ముఖ్య అతిథి, పిల్లలు పిల్లలు తల్లి దండ్రులతో పాటు భోజనం చేస్తారని అన్నారు.

శనివారం కామన్ డైట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఉన్నందున ఆరోజు నాన్ వెజ్ ఆదివారం మెనూ తయారు చేయాలని సూచించారు. గతంలో ఉన్న డైట్ చార్జీలు 8 సంవత్సరాల తర్వాత 40 శాతం ప్రస్తుత ప్రభుత్వం పెంచిందని, కాస్మెటిక్ చార్జీలను 16 సంవత్సరాల తర్వాత 200 శాతం పెంచినట్లు, పాఠశాలలో చదివి విద్యార్థుల ఎదుగుదల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం అత్యంత శ్రద్ధ వహిస్తుందనే సందేశం ముఖ్య అతిథి మాట్లాడేలా చూడాలని అన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం గురించి తల్లిదండ్రులకు కామన్ డైట్ లాంచ్ సందర్భంగా తెలియజేయాలని అన్నారు.

పాఠశాలలకు సరుకులు ఏ విధంగా వస్తున్నాయి కిచెన్ లో ఏ విధంగా భద్రపంచాలి, విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు అంశాల పై సిబ్బందికి అవసరమైన శిక్షణ అందిస్తున్నామని అన్నారు.కిచెన్, డైనింగ్ ఏరియా లను శుభ్రం చేయాలని, ఆ ప్రాంతాలను ఎప్పుడు శుభ్రంగా ఉంచుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఈవో జగన్మోహన్ రెడ్డి, రెసిడెన్షియల్ పాఠశాలల ఆర్.సి. ఓ.లు, ప్రిన్సిపాల్, విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొట్టడం తప్పే..

- అందుకు బాధపడుతున్నాను
- మీ ఇంట్లో ఎవరైనా దూరితే అంగీకరిస్తారా? అని ప్రశ్న
- నటుడు మోహన్‌బాబు



**బలగం టీవీ , హైదరాబాద్**

నటుడు మోహన్‌బాబు కుటుంబ వివాదం నేపథ్యంలో ఆయన ఇంటివద్దకు వెళ్లిన జర్నలిస్టుపై ఆయన దాడి చేశారంటూ జర్నలిస్టు సంఘాలు ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. ఆయన క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మోహన్ బాబు స్పందించారు. ఆడియో సందేశాన్ని మోహన్ బాబు విడుదల చేశారు.

జర్నలిస్టులను కొట్టాలని తాను దైవసాక్షిగా అనుకోలేదన్నారు. మొదట తాను జర్నలిస్టుకు నమస్కారం పెట్టానని, అయినా అతను తన వద్ద మైక్ పెట్టారని తెలిపారు. ఆ మైక్ తన కన్నుకు తగలబోయిందని, తృటిలో తాను తప్పించుకున్నట్లు చెప్పారు. విజయవాడలో తాను ఒకప్పుడు ఉద్యోగినేనని గుర్తు చేశారు. తన ఇంటికి వచ్చినవారు మీడియా వారా వేరే వారు ఎవరైనా వచ్చారా అనే విషయం తనకు తెలియదన్నారు. మీ ఇంట్లో ఎవరైనా దూరితే... మీ ఏకాగ్రతను భగ్నం చేస్తే అంగీకరిస్తారా?... న్యాయాధిపతులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, వ్యాపారస్తులు, మీడియా ప్రతినిధులు దీనిపై ఆలోచించాలన్నారు. నేను కొట్టిన దెబ్బ అతనికి తగిలిందన్నారు. జరిగిన ఘటనకు బాధపడుతున్నానని, ఆ జర్నలిస్టు తనకు తమ్ముడులాంటి వారన్నారు. మీడియా ప్రతినిధి భార్యాబిడ్డల గురించి తాను ఆలోచించానని... కానీ తన గురించి ఎవరూ ఆలోచించలేదన్నారు. తాను సినిమాల్లో నటిస్తానని... నిజజీవితంలో మాత్రం నటించాల్సిన అవసరం లేదన్నారు. మీకు టీవీలు ఉన్నాయి... మాకు టీవీలు (చానళ్లు) లేవు... రేపు నేను కూడా టీవీని పెట్టవచ్చు... అది కాదు గొప్ప... కానీ మీడియా ప్రతినిధి మనసును గాయపర్చినందుకు చింతిస్తున్నానన్నారు. మనసును గాయపెట్టాక చింతించి లాభం ఏమిటని ఎవరైనా అడిగితే ఇక నేనేం చేయను... మీరు చేసిందేమిటని ప్రశ్నించారు. మళ్లీ మళ్లీ చెబుతున్నాను... అసలు అతను నిజంగా జర్నలిస్టా? కాదా? అని నాకు ఎలా తెలుస్తుంది? అని ప్రశ్నించారు. కొట్టడం తప్పైనప్పటికీ ఏ సందర్భంలో కొట్టానో చూడాలన్నారు. కానీ మీరు ఈ విషయాలు చెప్పడం లేదన్నారు. పైన భగవంతుడు చూస్తున్నాడని వ్యాఖ్యానించారు. తాను ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని, తాను చేసిన మంచి పనులను ఎవరూ అర్థం చేసుకోవడంలేదన్నారు. జర్నలిస్టులను కొట్టడం మాత్రం తప్పే అయినప్పటికీ.. సందర్భాన్ని అర్థం చేసుకోవాలని మోహన్‌బాబు తన ఆడియో సందేశంలో పేర్కొన్నారు. తాను ఉద్దేశపూర్వకంగా కొట్టలేదన్నారు. మైకులు లాక్కుని కొట్టేంత మూర్ఖుడిని తాను కాదన్నారు. పోలీసులంటే తనకు ఎంతో ఇష్టమని, వారు శాంతి భద్రతలను కాపాడాలన్నారు. కొందరు పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మోహన్‌బాబు ఆరోపించారు. ఇది న్యాయమా.. అన్యాయమా అనేది ఆలోచించాలన్నారు.

# కొండా సురేఖ, నాగార్జున కేసు వాయిదా

**బలగం టీవీ , హైదరాబాద్**

మంత్రి కొండా సురేఖపై టాలీవుడ్ హీరో నాగార్జున వేసిన పరువు నష్టం కేసు విచారణను నాంపల్లి కోరు ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. గత విచారణ సందర్భంగా మంత్రి కొండా సురేఖ కోర్టు విచారణకు హాజరుకావాలని నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. అయితే గురువారం జరిగిన విచారణలో కొండా సురేఖ తరుపున హాజరైన న్యాయవాది మంత్రి సురేఖ హాజరు కోసం మరో తేదీ ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. ఆయన అభ్యర్థనను మన్నించిన కోర్టు విచారణను మరో ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. కాగా ఈ కేసులో ఇదివరకే ఇరుపక్షాల వాదనలు ముగిసిపోగా, తదుపరి విచారణ కీలకంగా మారింది. మంత్రి కొండా సురేఖ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను విమర్శించే క్రమంలో నాగచైతన్య, సమంత విడాకులపైన, నాగార్జునపైన, కుటుంబంపైన చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. ఆమె వ్యాఖ్యలపై ఇటు నాగార్జున, అటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పరువు నష్టం దావా వేశారు. ఈ రెండు కేసుల్లోనూ పిటిషనర్ల వాదనలను కోర్టు రికార్డ్ చేసింది.

# గ్రూప్ -2 పరీక్షల హాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు.

**-పరీక్షల నిర్వహణపై అధికారులు, సిబ్బందికి శిక్షణ**

**-అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఏఎస్పీ చంద్రయ్య**



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

ఈ నెల 15, 16 తేదీల్లో జిల్లాలోని అన్ని కేంద్రాల్లో గ్రూప్ -2 నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఏఎస్పీ చంద్రయ్య అధికారులను ఆదేశించారు. గురువారం గ్రూప్ -2 పరీక్షల నిర్వహణపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అబ్జర్వర్స్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, చీఫ్ సూపర్ ఇండెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, లోకల్ రూట్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చారు. పరీక్ష కేంద్రంలో నిర్వర్తించాల్సిన విధులపై వివరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, టీజీ పీఎస్సీ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నె ల 15 ఆదివారం ఉదయం 10.00 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 03.00 నుంచి 05.30 వరకు,తేది 16 సోమవారంఉదయం 10.00 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 03.00 నుంచి 05.30 వరకు పరీక్షలు నిర్వహించను న్నామనిఅన్నారు . పరీక్షకు మొత్తం 7163 మంది పరీక్షకు హాజరుకానున్నారని వెల్లడించారు. ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించాలని స్పష్టం చేశారు.

**జిల్లాలో 26 కేంద్రాలు..**

ఉదయం 09.30 గంటల తరువాత, మధ్యాహ్నం 02.30 గంటల తరువాత అభ్యర్థులకు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం అబ్జర్వర్స్ 26, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్ 26 చీఫ్ సూపర్ ఇండెంట్స్ 26 ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పరిశుభ్రత పనులు చేయించాలని, సెస్ అధికారులు కరెంట్ సరఫరాలో లోపాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.

**ఒక రోజు ముందే చూసుకోవాలి..**

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఒక రోజు ముందే తమ పరీక్ష కేంద్ర చిరునామా సరిచూసుకోవాలని పేర్కొన్నారు. బయో మెట్రిక్ అటెండెన్స్ ఉన్నందున అభ్యర్థులు పరీక్ష రోజు నిర్దేశించిన సమయాన్ని కంటే ముందే చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ గుర్తింపు కార్డులు మినహా ఏమీ వెంట తీసుకురావద్దని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎగ్జామ్ సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్లు, ఆర్సీఓ, జేఎన్టీయూ అగ్రహారం కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# రికార్డు స్థాయి కనిష్ఠానికి దిగజారిన రూపాయి విలువ

**బలగం టీవీ , ముంబై**



ఇండియన్ కరెన్సీ రూపాయి విలువ గురువారం రికార్డు స్థాయి కనిష్ఠానికి పడిపోయింది. మరోవైపు అమెరికా డాలరుకు డిమాండ్ పెరిగింది. డాలరుతో పోల్చినప్పుడు రూపాయి విలువ 84.88 కు చేరింది. యుఎస్ బాండ్స్ ఈల్డ్స్ కూడా గురువారం పుంజుకున్నాయి. భారతీయ రిజర్వు బ్యాంకు ఎప్పటిలానే గురువారం కూడా స్పాట్ మార్కెట్ లో డాలర్లను అమ్మేసింది. న్యూ ఆల్ టైమ్ లోస్ నుంచి రూపాయి విలువను కాపాడడానికి మద్దతు ఇచ్చింది. కాగా ఇండియా రిటైల్ ఇన్ ఫ్లేషన్ డేటా కోసం మదుపరులు ఎదురుచూస్తున్నారు.

# నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**బలగం టీవీ , ముంబై**

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాలను మూటకట్టుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో మన మార్కెట్లు ఒడిదుడుకులకు గురయ్యాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 236 పాయింట్లు నష్టపోయి 81,289కి పడిపోయింది. నిఫ్టీ 93 పాయింట్లు కోల్పోయి 24,548 వద్ద స్థిరపడింది.

బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్: టెక్ మహీంద్రా (1.67%), భారతి ఎయిర్ టెల్ (1.56%), ఇండస్ ఇండ్ బ్యాంక్ (1.31%), ఇన్ఫోసిస్ (0.92%), అదానీ పోర్ట్స్ (0.90%).

టాప్ లూజర్స్: ఎన్టీపీసీ (-2.76%), హిందుస్థాన్ యూనిలీవర్ (-2.42%), టాటా మోటార్స్ (-1.59%), మారుతి (-1.42%), ఎల్ అండ్ టీ (-1.26%).

# ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా 18 ఏండ్ల గుకేశ్

**బలగం టీవీ , హైదరాబాద్**



భారత యువ గ్రాండ్ మాస్టర్ గుకేశ్ ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా అవతరించాడు. చివరిదైన 14వ గేమ్‌లో చైనాకు చెందిన లిరెన్‌ను ఓడించిన గుకేశ్ ప్రపంచ ఛాంపియన్ షిప్ ను కైవసం చేసుకున్నాడు. అత్యంత చిన్న వయసులో 18 ఏళ్లకే గుకేశ్ ఈ ఘనత సాధించి చరిత్ర సృష్టించాడు. మొత్తం 14 గేమ్‌లలో గుకేశ్ 3, లిరెన్ 2 గేమ్‌లో విజయం సాధించారు. తొమ్మిది గేమ్‌లు డ్రా అయ్యాయి. ఈ క్షణం కోసం తాను పదేళ్లుగా కలలు కన్నానని గుకేశ్ అన్నాడు. తన కల నెరవేరినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నాడు. ఈ విజయాన్ని తాను ఊహించలేదని, ఈ ఘనత సాధించగానే భావోద్వేగానికి లోనయ్యానన్నాడు. తన దృష్టిలో లిరెన్ నిజమైన ప్రపంచ ఛాంపియన్ అని పేర్కొన్నాడు. లిరెన్‌కు అతను ధన్యవాదాలు తెలిపాడు.

# 'యూఐ' సెన్సార్ పూర్తి




**బలగం టీవీ, హైదరాబాద్**

కన్నడ అగ్రనటుడు ఉపేంద్ర పోషించే పాత్రలు కూడా విలక్షణంగా అనిపిస్తాయి. ఈ నేపథ్యంలో ఉపేంద్ర స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న పీరియాడిక్ ఫాంటసీ చిత్రం 'యూఐ'పై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. లహరి ఫిల్మ్స్ పతాకంపై జి.మనోహరన్, కేపీ శ్రీకాంత్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నది. తాజాగా ఈ సినిమా సెన్సార్ పూర్తయింది. యూ/ఏ సర్టిఫికెట్ లభించింది. చాలా విరామం తర్వాత ఉపేంద్ర దర్శకత్వం వస్తున్న ఈ సినిమాలో ఎన్నో సర్‌ప్రైజ్‌లుంటాయని మేకర్స్ తెలిపారు. సమకాలీన సమాజంలోని సంఘటనలతో పాటు భవిష్యత్తు భారతంలోని సమస్యలను కథాంశంగా తీసుకొని తనదైన శైలిలో ఉపేంద్ర ఈ సినిమాను తెరకెక్కించారని, కొంతభాగం కథ 2040లో నడుస్తుందని, విజువల్స్ అబ్బురపరుస్తాయని చిత్ర బృందం పేర్కొంది. రీష్మా నానయ్య, మురళీశర్మ, సన్నీ లియోన్, నిధి సుబ్బయ్య తదితరులు ఈ చిత్రలో నటించారు.

# ఘనంగా కీర్తిసురేశ్ వివాహం

**బలగం టీవి, హైదరాబాద్**

నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటి కీర్తిసురేశ్ ఆంథోని తటిల్ వివాహబంధంతో ఒక్కటయ్యారు. సౌతిండియా సంప్రదాయ పద్ధతిలో కీర్తిసురేశ్ మెడలో మూడు ముళ్ల వేశాడు ఆంథోని తటిల్. కీర్తిసురేశ్ దంపతులకు కుటుంబసభ్యులు, ప్రముఖులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇక వివాహానికి సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ.. #ForTheLoveOfNyke హ్యాష్‌ట్యాగ్ జత చేసింది కీర్తిసురేశ్.



# ఒలింపిక్స్‌లో క్రికెట్..!

**● ఒలింపిక్స్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులతో ఐసీసీ చైర్మెనట్ జేషా భేటీ**




**బలగం టీవి, బ్రిస్బేన్**

ఒలింపిక్స్ క్రీడల్లో మళ్లీ క్రికెట్‌కు చోటు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. 128 సంవత్సరాల తర్వాత, జెంటిల్మెన్ ఆట ఒలింపిక్స్‌లో తిరిగి చేరిపోతుంది. 2028లో లాస్ ఏంజిల్స్‌లో జరిగే క్రీడల్లో క్రికెట్ ఆడనున్నారు. అయితే, 2032లో బ్రిస్బేన్‌లో జరిగే ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు అవకాశం కల్పించే అంశంపై గురువారం చర్చ జరిగింది. ఈ సమావేశంలో కొత్తగా ఐసీసీ చైర్మన్‌గా నియమితులైన జే షా.. బ్రిస్బేన్ ఒలింపిక్స్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులతో మాట్లాడారు.సమ్మర్ క్రీడల్లో ఒలింపిక్స్‌ను జోడించాలా లేదా అన్న అంశంపై చర్చ జరిగింది. లాస్ ఏంజిల్స్ క్రీడలకు ఓకే చెప్పినా.. బ్రిస్బేన్ క్రీడలకు ఇంకా కన్ఫర్మేషన్ దక్కలేదు. అయితే బ్రిస్బేన్‌లో అధికారులతో జరిగిన చర్చకు సంబంధించిన వీడియోను జే షా తన ట్విట్టర్‌లో అప్‌లోడ్ చేశారు. బ్రిస్బేన్ ఆర్గనైనింగ్ కమిటీ చీఫ్ సిండీ హుక్, క్రికెట్ ఆస్ట్రేలియా సీఈవో నిక్ హక్లే ఆ మీటింగ్‌కు హాజరయ్యారు.

# రూమర్స్‌పై స్పందించిన సాయి పల్లవి

**బలగం టీవి, హైదరాబాద్**

టి సాయి పల్లవి ప్రస్తుతం బాలీవుడ్‌లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న రామాయణలో సీతగా నటిస్తోంది. అయితే, ఈ చిత్రం కోసం సాయి పల్లవి తన అలవాట్లను మార్చుకుందంటూ వార్తలు వచ్చాయి. రామాయణ సినిమా పూర్తయ్యేవరకు సాయి పల్లవి మాంసాహారం మానేశారని, హోటల్స్‌లో కూడా తినడం లేదని కోలీవుడ్‌లోని ఓ ప్రముఖ మీడియా సంస్థ వార్తలు రాసింది. సాయి పల్లవి విదేశాలకు వెళ్లేటప్పుడు కూడా వంట వాళ్లను వెంట తీసుకెళ్తుందని అందులో రాసి ఉంది. దీనిపైనే సాయిపల్లవి తాజాగా స్పందించింది. ఇలాంటి నిరాధారమైన రూమర్స్ రాస్తే, ఎంత పెద్ద సంస్థ అయినా లీగల్ యాక్షన్ ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పింది. "నాపై ఎన్నో సార్లు రూమర్స్ వచ్చాయి. వస్తున్నాయి. కానీ నేను ప్రతిసారీ మౌనంగానే ఉన్నాను. ఎందుకంటే నిజం ఏంటనేది దేవుడికి తెలుసు. కానీ ఇలా మౌనంగా ఉంటున్నానని రూమర్స్ ఎక్కువగా రాసేస్తున్నారు. ఇప్పుడు వాటిపై స్పందించాల్సిన సమయం వచ్చింది. నా సినిమాల రిలీజ్‌లు, నా ప్రకటనలు, నా కెరీర్, ఇలా నాకు సంబంధించి ఏదైనా నిరాధారమైన వార్తలు రాస్తే, చట్టబద్ధమైన యాక్షన్ తీసుకుంటాను. అది గుర్తింపుపొందిన మీడియా సంస్థ అయినా లీగల్ యాక్షన్ తీసుకుంటాను.



ఇన్నాళ్లు సహించాను. ఇకపై ఇలాంటి చెత్త వార్తలను మోసుకెళ్లడానికి నేను సిద్ధంగా లేను" అని రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారింది.

# ప్లేఆఫ్స్‌కు హర్యానా స్టీలర్స్



**బలగం టీవి, హైదరాబాద్**

ప్రో కబడ్డీ లీగ్ సీజన్-11లో ప్లేఆఫ్స్‌కు చేరిన తొలి జట్టుగా హర్యానా స్టీలర్స్ నిలిచింది. బుధవారం పుణె వేదికగా జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్‌పై ఘన విజయం సాధించి ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. హర్యానా 37-26 పాయింట్ల తేడాతో నెగ్గింది. ఈ సీజన్‌లో 19 మ్యాచ్‌లు ఆడిన హర్యానా 15 విజయాలు, 4 ఓటములు చవిచూసింది. 77 పాయింట్లతో టేబుల్ టాపర్‌గా కొనసాగుతోంది. మరోవైపు 18 మ్యాచ్‌ల్లో రెండే విజయాలతో బెంగళూరు పట్టికలో అట్టడుగున నిలిచింది. తొలి అర్ధభాగంలో బెంగళూరుపై హర్యానా 15-11తో పైచేయి సాధించింది. రెండో అర్ధభాగంలో దూకుడు పెంచి బెంగళూరు బుల్స్‌ను ఒక్కసారి ఆలౌట్ చేసింది. రైడింగ్, ట్యాకిల్‌లో సత్తాచాటి మ్యాచ్‌ను ముగించింది. హర్యానా స్టీలర్స్‌లో వినయ్ 9, శివమ్ 8 పాయింట్లతో సత్తాచాటారు. బెంగళూరు జట్టులో 5 పాయింట్లు సాధించిన జతిన్ టాప్ స్కోరర్.





# "డాకు మహారాజ్" ఫస్ట్ సింగిల్ డేట్ ఫిక్స్..

**బలగం టీవి, హైదరాబాద్**

నందమూరి బాలకృష్ణ హీరోగా దర్శకుడు కొల్లి బాబీతో చేస్తున్న భారీ చిత్రం "డాకు మహారాజ్". అయితే సినిమాకు సంబంధించిన మొదటి పాట అప్డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. ఈ సాంగ్ ని మేకర్స్ డిసెంబర్ 14న రిలీజ్ చేస్తున్నట్టుగా అనౌన్స్ చేసేసారు. అలాగే ఇదొక పవర్ఫుల్ ట్రాక్ అంటూ కూడా తెలిపారు. ఇక దీనికి సంబంధించిన ప్రోమోని డీసెంబర్ 13(నేడు) ఉదయం 10 గంటల 8 నిమిషాలకి విడుదల చేయబోతున్నట్టు తెలిపారు.

# టీ 20 ఫార్మట్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ..!

**బలగం టీవి, హైదరాబాద్**



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ-2025 నిర్వహణపై సందిగ్ధత కొనసాగుతోంది. డ్రాఫ్ట్ షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 19 నుంచి జరగాల్సి ఉంది. కానీ పాకిస్థాన్ వేదికగా జరగాల్సిన ఈ టోర్నీకి సంబంధించిన పనులు ముందడుగు పడట్లేదు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పాకిస్థాన్?కు ఎట్టి పరిస్థితుల్లో భారత జట్టును పంపబోమని బీసీసీఐ ఇప్పటికే స్పష్టం చేసింది. మరోవైపు, టోర్నీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించే విషయంపై పీసీబీ తన స్పష్టమైన వైఖరిని ఇప్పటికీ అధికారికంగా తెలియజేయలేదు. దాంతో ఇప్పటికీ అధికారిక షెడ్యూల్ విడుదల కాలేదు. దాంతో ఛాంపియన్స్ ట్రోఫీని సమర్ధవంతంగా మార్కెటింగ్ చేయలేకపోతున్నామని ప్రసారకర్తలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో మరికొన్ని రోజులు మెగాటోర్నీ నిర్వహణపై ప్రతిష్టంభన కొనసాగితే.. టీ20 ఫార్మాట్‌లో నిర్వహించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. వన్డే ఫార్మాట్ కంటే టీ20లకు ఆదరణ ఎక్కువ లభించనుడంటంతో.. పొట్టిఫార్మాట్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించాలనే యోచనలో ఐసీసీ ఉంది.

మార్కెటింగ్ వంటి ఆర్థిక పరమైన ఇబ్బందుల కారణంగా టీ20 ఫార్మాట్‌లో నిర్వహించేలా బ్యాకప్ ప్లాన్‌తో ఐసీసీ ఉంది. అయితే ఈ నిర్ణయం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వంటి స్టార్ ప్లేయర్లకు బిగ్ షాక్‌గా మారనుంది. ఛాంపియన్స్ ట్రోఫీతో మరో ఐసీసీ ట్రోఫీని ముద్దాడాలనుకున్న వాళ్ల ఆశలకు బ్రేక్ పడేలా ఉంది. టీ20 వరల్డ్ కప్-2024 విజయానంతరం ఈ ఇద్దరూ పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు

**బలగం టీవి, హైదరాబాద్**

జర్నలిస్ట్‌పై దాడి కేసులో నటుడు మోహన్ బాబుపై బీఎన్ఎస్ 109 సెక్షన్ కింద పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అయితే, బుధవారం మోహన్ బాబుపై 118 సెక్షన్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు లీగల్ ఒపీనియన్ తీసుకుని సెక్షన్‌ను మార్చారు.

## ఆసుపత్రి నుంచి మోహన్‌బాబు డిశ్చార్జ్

గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రి నుంచి నటుడు మోహన్‌బాబు డిశ్చార్జ్ అయ్యారు. మంగళవారం రాత్రి జల్‌పల్లిలోని తన నివాసం వద్ద జరిగిన ఘర్షణ అనంతరం మోహన్‌బాబు ఆస్పత్రిలో చేరారు. ఒళ్ళు నొప్పులు, ఆందోళన వంటి కారణాలతో ఆయన ఆసుపత్రిలో చేరారని, వైద్య పరీక్షల అనంతరం ఆయనకు కంటి దిగువభాగంలో గాయమైనట్లు గుర్తించామని వైద్యులు తెలిపారు. బీపీ ఎక్కువగా ఉందని.. గుండె కొట్టుకోవడంలో హెచ్చుతగ్గులు ఉన్నాయని వెల్లడించారు. రెండ్రోజుల చికిత్స తర్వాత గురువారం మధ్యాహ్నం డిశ్చార్జ్ అయ్యారు. తన నివాసం వద్ద జరిగిన ఘర్షణకు సంబంధించి విచారణకు హాజరు కావాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు నోటీసులు జారీ చేశారు. దీనిపై మోహన్‌బాబు హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఈనెల 24 వరకు స్టే ఇచ్చింది.